క్లుప్తంగా

వైభవంగా సుదర్శన హోమం



విజయవాడ కల్చరల్: కంచికామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయం లబ్బీపేటలో లోక కల్యాణార్థం బుధవారం రుత్వికులు సుదర్శన హోమం నిర్వహించారు. పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామికి పంచామృత అభిషేకం, తోమాల సేవలను వైభవంగా నిర్వహించారు. వేదపండితులు దినత్రయ చతుర్వేదాలను పారాయణం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ రామ్మోహనరావు మాట్లాడుతూ.. శుక్రవారం గణేష హోమం, ఆదివారం మహా సౌర అరుణ పారాయణ, 20వ తేదీన చండీ హోమం, 26వ తేదీన రాహుకేతు పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ వినియోగదార్లకు షెడ్డు ఏర్పాటు



పాయకాపురం(విజయవాడ రూరల్): పాయకాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ బిల్లులు చెల్లించడానికి వచ్చే వినియోగదార్ల సౌకర్యార్థం దాతల సహకారంతో విద్యుత్‌శాఖ సిబ్బంది సబ్‌స్టేషన్ ఆవరణలో షెడ్డు నిర్మించారు. బిల్లులు చెల్లించడానికి, వివిధ అవసరాల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారు ఎండ, వర్షానికి ఆరు బయటే ఉండడం వల్ల అవస్థలు పడుతున్నారు. దీంతో సిబ్బంది ఏఈ కార్యాలయానికి తూర్పు భాగంలో రేకుల షెడ్డు నిర్మించారు.

బచ్చా మేస్త్రి ఆకస్మిక మృతి



మధురానగర్(విజయవాడ సెంట్రల్): మధురానగర్‌కు చెందిన సంఘ సేవకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బచ్చా మేస్త్రి(62) బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. మంగళవారం రాత్రి మధురానగర్ నేతాజీ కాలనీలో నిద్రపోయిన ఆయన ఉదయం మృతి చెంది ఉన్నారు. నిద్రలోనే గుండెపోటుతో మృతి చెంది ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. బచ్చా మేస్త్రికి భార్య, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి బచ్చా మేస్త్రి మృతదేహాన్ని సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం గౌతంరెడ్డి మాట్లాడుతూ.. నగరంలోని ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో బచ్చా మేస్త్రి తనదైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై ఫిర్యాదు చేయగా కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పంజా సెంటర్‌కు చెందిన షేక్ రేష్మా(25)కు ఏడాది కిందట కొత్తూరు తాడేపల్లికి చెందిన గౌస్‌బాషాతో పెద్దలు వివాహం జరిపించారు. గౌస్‌బాషా ఏసీ మెకానిక్‌గా పని చేస్తుంటాడు. కొంత కాలంగా గౌస్‌బాషా ప్రతి చిన్న విషయానికి భార్యతో గొడవ పడుతూ వేధించసాగాడు. భర్తకు అత్త, మామల మద్దతు ఉంది. కొన్ని రోజుల కిందట రేష్మాను పుట్టింటి వద్ద వదిలిపెట్టి వెళ్లిపోయాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఫీజుల కుంభకోణంపై సిట్ విచారణ చేపట్టాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మోహన్‌బాబు యూనివర్సిటీ ఫీజుల కుంభకోణంపై సిట్ విచారణ చేపట్టాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ విచారణ కేవలం ట్యూషన్ ఫీజుల పరిశీలనకు మాత్రమే పరిమితమైందన్నారు. అసలు కుంభకోణం యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న హాస్టల్, మెస్ ఫీజుల వ్యవహారంలోనే జరిగిందని ఆరోపించారు. శ్రీ విద్యా నికేతన్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో ముఖ్య సభ్యుడైన మంచు విష్ణు హాస్టల్, మెస్ ఫీజుల రూపంలో దాదాపు రూ.200 కోట్లకు పైగా విద్యార్థుల నుంచి వసూలు చేసి, వాటిని తన వ్యక్తిగత సంస్థకు మళ్లించారని ఫెడరేషన్ ఆరోపించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకునే చర్యల ద్వారా అక్కడ పనిచేస్తున్న వేలాదిమంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వారి జీవనోపాధి దెబ్బతినకుండా ప్రభుత్వం శ్రీ విద్యా నికేతన్ ఎడ్యుకేషన్ ట్రస్టును, దాని ఆస్తులను స్వాధీనపరచుకోవాలని కోరారు.

నిలిచిన అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణ పనులు

- అధిక వర్షాలకు ముందుకు కదలని మురుగు
- మురుగుతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రాజీవ్‌నగర్‌లో నిలిచిన అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం, పక్కనే పేరుకుపోతున్న మురుగు

పాయకాపురం(విజయవాడ రూరల్): విజయవాడ నగర శివారులో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం పనులు నిలిచిపోవడంతో మురుగు సమస్య క్రమేణా అధికమవుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద విజయవాడ నగర పాలక సంస్థకు మంజూరు చేసిన నిధుల్లో రూ.7 కోట్లతో రాజీవ్‌నగర్, కండ్రిక, ప్రాంతాల్లో అవుట్‌ఫాల్ డ్రెయిన్‌నిర్మాణం పనులను ఈ ఏడాది ఏప్రియల్ 24వ తేదీన ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అధికారులతో కలిసి పనులకు భూమి పూజ చేశారు. రాజీవ్‌నగర్ వడ్డెర కాలనీ, కండ్రిక-రాజీవ్‌నగర్ రోడ్డులో కొద్దిపాటి పనులు ప్రారంభించగా రెండు నెలల కిందట ఆ పనులు నిలిచిపోయాయి. గత నెలలో వచ్చిన వర్షాలకు మురుగు ఎక్కడ పడితే అక్కడే నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

దుర్వాసనతో అవస్థలు..

అంతర్గత డ్రెయిన్‌ల నుంచి అవుట్‌ఫాల్ డ్రెయిన్ వరకు మురుగు వెళ్లడానికి కనెక్షన్లు ఉండడంతో అవి ముందుకు కదలడం లేదు. దీంతో వర్షం నీరు మురుగు నీటితో కలిసి నిల్వ ఉండటంతో ప్రజలు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం పని తీసుకున్న కాంట్రాక్ట్ సంస్థకు అధికార పార్టీ నాయకులు సిండికెట్‌గా ఉండటం వల్ల ఇంజినీరింగ్ అధికారులు ఒత్తిడి చేయలేకపోతున్నారన్న విమర్శలున్నాయి. గత నెలలో జోరుగా కురిసిన వర్షాల కారణంగా వర్షం నీరు మురుగు కాలువల్లోనే నిల్వ ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు వల్ల దోమల ఉధృతి పెరిగి అనారోగ్యం బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం పనులు వేగవంతంగా చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పనులు వేగవంతం చేయాలి..



అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణం పనులు ప్రస్తుతం నిలిచిపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. దోమల వ్యాప్తి ఎక్కువ అవుతుంది. పనులు వేగవంతంగా జరిగేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి.

ఎం.జగదీష్, రాజీవ్‌నగర్

మురుగు లేకుండా చూడాలి..



వర్షం కురిస్తే ఎక్కడ మురుగు అక్కడే నిల్వ ఉంటుంది. దీంతో దుర్వాసన వస్తోంది. వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. మురుగు నిల్వ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి.

కె.రంగయ్య, రాజీవ్‌నగర్

కంట్రోల్ రూం, కమాండ్ కంట్రోల్‌లను తనిఖీ చేసిన సీపీ



కంట్రోల్‌రూమ్ సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ రాజశేఖరబాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని పోలీస్ కంట్రోల్‌రూమ్, ఎంజీ రోడ్డులోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లను బుధవారం పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు ఆకస్మిక తనిఖీ చేశారు. డీసీపీ తిరుమలేశ్వరరెడ్డితో కలిసి నిర్వహించిన ఈ తనిఖీల్లో కంట్రోల్ రూమ్ సిబ్బంది పనితీరును గమనించారు. వచ్చిన కాల్స్‌ను రిసీవ్ చేసుకుని అధికారులకు తెలియచేయాలని, అనంతరం కాల్‌కు వెళ్లిన వారి వద్ద నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు. ఎప్పుడూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తగు సూచనలు తెలిపారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి అస్త్రం యాప్ ద్వారా నగరంలోని ట్రాఫిక్ రద్దీపై రివ్యూ నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిరంతరం సి.సి.కెమెరాలను పర్యవేక్షించాలని, ఏదైనా ఘటనలు జరిగితే వెంటనే అధికారులకు సదరు విషయం తెలియజేయాలన్నారు. కేసుల పరిష్కారంలో భాగంగా పోలీస్ స్టేషన్ నుంచి వచ్చిన వారికి పూర్తిగా సహకరించి వారికి అవసరమైన సి.సి.ఫుటేజ్ లను అందించి కేసులు త్వరగా కొలిక్కి వచ్చేవిధంగా సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీ భానుప్రకాష్‌రెడ్డి, ఎస్.బి. సీఐ డి.వి.రమణ , కంట్రోల్ రూం సీఐ కనకరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వారికి జరిమానా

విజయవాడ లీగల్: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 10 మందిపై 2వ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరు పరచగా, ఆరో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు ఒకరికి రూ.15 వేలు, మిగిలిన 9మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం ఆదేశాలు జారీచేశారు. రోజూ ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

ఘంటసాల విగ్రహం ఏర్పాటు చేయాలి



విజయవాడ కల్చరల్: నూతన రాజధాని అమరావతిలో అమర గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు విగ్రహం ఏర్పాటుకు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీకళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి, పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు చైతన్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం కొత్తా పూర్ణానందం కళావేదిక మీద ఘంటసాల అభిమానుల ఆత్మీయ సమావేశం, సినీ సంగీత విభావరి నిర్వహించారు. చిట్టిబాబు ఘంటసాల పేరుతో మ్యూజియం నిర్మాణం చేయాలని సూచించారు. ఘంటసాల చైతన్య వేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ.. ఘంటసాల జీవిత చరిత్ర ఆధారంగా బయోపిక్ నిర్మాణం చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు కె.డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, శింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మికంగా బాలికల హాస్టల్ తనిఖీ

పాయకాపురం(విజయవాడ రూరల్): జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పాయకాపురంలోని సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు తాగునీరు అందిస్తున్న వ్యవస్థను పరిశీలించారు. తాగేందుకు మినరల్ వాటర్ అందిస్తున్నామని వసతి గృహ అధికారులు తెలిపారు. పిల్లలు అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తగా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ మధ్య కాలంలో ఎవరైనా విషజ్వరాలు, డయేరియాకు గురయ్యారా అని అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కలెక్టర్ వెంట వసత గృహ సంక్షేమ అధికారులు కె.సరోజ గ్రేస్, పి.సుజాత ఉన్నారు.

నేడు రాజ్యాంగ పరిరక్షణ కోరుతూ ధర్నా

- మాజీ డీజీపీ, ఏఐబీఎస్పీ జాతీయ సమన్వయకర్త జె.పూర్ణచంద్రరావు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం గురువారం నగరంలోని ధర్నా చౌక్‌లో భారీ ధర్నా నిర్వహిస్తున్నామని ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ జె.పూర్ణచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాజ్యాంగంలో నుంచి లౌకిక-సామ్యవాద అనే పదాలను తొలగించేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం చూస్తోందని, అందువల్ల రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాన్ని నిర్వహించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విజయవాడ గాంధీనగర్‌లోని ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. గతంలో వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో కూడా ఇలాంటి ప్రయత్నం జరిగిందని, అప్పుడు కాన్షీరాం ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ ఎన్డీయే ప్రభుత్వం అలాంటి కుట్రలు చేస్తోందని, అందువల్ల ఇప్పుడు కాన్షీరాం స్ఫూర్తితో ఆయన వర్ధంతి రోజైన అక్టోబర్ 9 నుంచి రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రైస్తవ మైనారిటీలపైనే ఉందని అందువల్ల ఈ వర్గాలకు చెందిన ప్రజలంతా పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ధర్నాను జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా



ప్రకాష్‌నగర్‌లో ధర్నా నిర్వహిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

పాయకాపురం(విజయవాడ రూరల్): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై చెప్పు విసేరేందుకు ప్రయత్నించిన మతోన్మాద న్యాయవాది కిషోర్‌పై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్‌లో బుధవారం ధర్నా నిర్వహించారు. కేవీపీఎస్ నాయకులు చింతల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు అంద్ర మాల్యాద్రి, గుండిమెడ క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. ఈ ఘటన దేశానికి అవమానమని పేర్కొన్నారు. అత్యున్నత పదవులో ఉన్నవారికే ఇలాంటి అవమానాలు జరిగితే.. ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సనాతన ధర్మం పేరుతో కులవ్యవస్థను పెంచేందుకు మనువాద మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయన్నారు. పాలక ప్రభుత్వాలు ఇలాంటి వాటిని అరికట్టే ప్రయత్నం చేయకపోగా నిందితులపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర నాయకులు ఎస్కే నిజాముద్దీన్, శివలింగేశ్వర్, స్థానిక పెద్దలు రాధాకృష్ణ, ఎం.శ్రీను, అరుణ, అమ్ములు, కార్మికులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల బాధలు పట్టవా?



స్మృతి వనం మెయిన్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు బకాయిపడిన తొమ్మిది నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం వద్ద కార్మికులకు జీతాలు చెల్లించాలని కోరుతూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వినూత్న నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు, సీఐటీయూ నాయకులు కళ్లకు నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. తొమ్మిది నెలలు పెండింగ్ ఉన్నా జీతాలు ఇవ్వకుండా కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ రవికిరణ్ పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల విషయంలో కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎ.కమల మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంట్రాక్ట్ కార్మికులకు 9 నెలలుగా జీతాలు ఎందుకు ఇవ్వడం లేదో అధికారులు కార్మికులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూడు నెలల క్రితం మంత్రి నారా లోకేష్‌ను కార్మికులు వ్యక్తిగతంగా కలిసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. కలెక్టర్, మునిసిపల్ కమిషనర్‌లను కలిసిన సందర్భంలో ఉన్నత స్థాయి అధికారులే ఎవరికి వారు తమకు సంబంధం లేదని ఒకరి మీద ఒకరు చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. సీఐటీయూ సెంట్రల్ సిటీ కార్యదర్శి యం.బాబురావు కాంట్రాక్ట్ కార్మికులు పి.సునీత, సి.హెచ్.విజయ్ కుమారి,పి. మేరీ,ఎం.సుజాత, కె.అనుష, ఎం.దీపిక, హెచ్.హరిత, కె.ధనలక్ష్మి, పి.సత్యవతి, మల్లిక, ఎస్.కె జహిందా, మణెమ్మ, లాము ధయమణి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే కుట్టుమిషన్ శిక్షణ



ఆటోనగర్(విజయవాడతూర్పు): మహిళల ఆర్థికాభివృద్ధిని పెంచేందుకు కుట్టుమిషన్ శిక్షణ ఇస్తున్నట్టు మెస్సీయ ఫెలోషిప్ చర్చి పాస్టర్ డాక్టర్ సజ్జా రత్నకుమార్ అన్నారు. ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని చర్చిలో బుధవారం కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 56 మంది మహిళలకు శిక్షణ సర్టిఫికెట్‌లతో పాటు మిషన్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ 2016 నుంచి ఇప్పటివరకు శిక్షణ పొందిన 1500 మందికి కుట్టు మిషన్‌లను ఉచితంగా ఇచ్చినట్టు చెప్పారు. మహిళల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని కమల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ట్రైనింగ్ సెంటరు ద్వారా విజయవాడ ప్రాంతంలోని పేద మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతి బ్యాచ్‌కి మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చిన తర్వాత ఉచితంగా కుట్టుమిషన్ ఇస్తున్నామన్నారు. ఆసక్తి గల మహిళలు ఆటోనగర్ లోని మెస్సీయ ఫెలోషిప్ చర్చి వద్దకు వచ్చి వివరాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, సజ్జా జ్యోతి, టైలరింగ్ శిక్షకులు పాల్గొన్నారు.

124 అంశాలు ఆమోదం



సభలో అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశం ఎజెండాలో మొత్తం 159 అంశాలు పొందుపరచగా అందులో 124 అంశాలను సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఆఫీస్ రిమార్కులకు 11 అంశాలు పంపగా, రెండు అంశాలు తిరస్కరణకు గురయ్యాయి. ఆరు అంశాలు వాయిదా వేయగా, ప్రత్యేక కమిటీలకు సిఫార్సుకు రెండు అంశాలను పంపారు. వీటితోపాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వ విభాగాలకు సిఫార్సు చేస్తూ నాలుగు అంశాలు తీర్మానించగా, రెండు అంశాలకు ప్రత్యేక కమిటీలు వేయాలని, రెండు అంశాలను రికార్డు చేయగా ఒక అంశాన్ని ధ్రువీకరిస్తూ తీర్మానం చేశారు.

రాణిగారితోటలో ఆర్‌యూబీ నిర్మించాలని నిరసన

కృష్ణలంకలోని రాణిగారితోటకు జాతీయ రహదారి నం16కి అండర్‌పాస్ చాలా అవసరమని, స్థానికంగా గుడ్‌మార్నింగ్ హోటల్ నుంచి నేతాజీ బ్రిడ్జి వరకు ఈ అండర్‌పాస్ నిర్మించటం వల్ల చాలా ప్రమాదాలు నివారించవచ్చని దీనిపై పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని స్థానిక కార్పొరేటర్ సభలో నిరసన వ్యక్తం చేశారు. నల్లకండువా కప్పుకుని ప్లకార్డుతో స్థానిక సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. వీఎంసీ కమిషనర్ కల్పించుకుని జాతీయ రహదారుల విభాగం అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయం జాతీయ రహదారుల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ప్రకటించడంతో ఆయన తన నిరసనను విరమించారు.

ఆర్‌వో వాటర్‌ప్లాంట్‌ల వ్యవహారంపై చర్చ

నగరంలో ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారని, దీనిపై ఇటీవల జరిగిన డయేరియా కారణంగా అన్ని ప్రాంతాల్లో ప్లాంట్ల తనిఖీలు చేయాలని, అదే సమయంలో నిబంధనలకు అనుగుణంగా వ్యాపారం సాగించే వారికి కూడా వీఎంసీ సహకరించాలని సత్యనారాయణపురం కార్పొరేటర్ శర్వాణమూర్తి సభలో చర్చించారు. ఆంధ్రరత్న పార్కు వద్ద ఉన్న మరుగుదొడ్ల నిర్మాణం కూడా త్వరితగతిన పూర్తిచేయాలని సభలో చర్చించారు.

డీసిల్టింగ్ పనులు నిరంతరం చేపట్టాలి



నగర పర్యటనలో వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో నిరంతరం డీసిల్టింగ్ పనులు జరుగుతుండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం ఏలూరు రోడ్డు, గుణదల సెంటర్, పులేటి కట్ట రోడ్డు, ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్డు, డెంటల్ కాలేజ్ రోడ్డు, గురునానక్ కాలనీ, వాసవి నగర్, న్యూ పీఅండ్‌టీ కాలనీ, పటమట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెట్ల వ్యర్థాలను, చెత్త కుప్పలను, ఎప్పటికప్పుడు తొలగించాలని, డీసిల్టింగ్ ప్రక్రియను నిరంతరం చేస్తుండాలని, సైడ్ కాలువలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. తదుపరి పటమటలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

దంతాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): దంతాలను ఎలా పరిరక్షించుకోవాలనే విషయాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని గుంటూరు సిబార్ డెంటల్ హాస్పటల్, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్స్, డాక్టర్లు శ్రీలేఖ, సుజన సూచించారు. ఆ హాస్పటల్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం ఉచిత డెంటల్ క్యాంపును నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు మాట్లాడుతూ.. దంతాలు బలంగా ఉంటే మనం కూడా బలంగా ఉండగలమని వివరించారు. రోజూ రెండు పూటలా బ్రష్ చేసుకోవాలని సూచించారు. పాఠశాలలోని 700 మంది విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించి వారిలో దంతక్షయం గల 50 మంది విద్యార్థులను గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం మైనం హుస్సేన్, సిబార్ డెంటల్-మెడికల్ సైన్సెస్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ పూజిత, ఉజ్వల, కావ్య శ్రావణి, ఏంజెలిన ప్రైసి, సాయి వాగ్దేవి, సుష్మ, తస్నీమ్, మధుషాలిని, విన్నీ శ్రత, కీర్తన, హిమజ, వైష్ణవి, మానస తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై నిలిచిన వర్షపు నీరు



మధురానగర్(విజయవాడ సెంట్రల్): నగరంలో బుధవారం సాయంత్రం ఆకాశం మేఘావృతంగా మారి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నరకు పైగా వర్షం కురవడంతో రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడ్డారు. ముఖ్యంగా కళాశాలలు, ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే వారు వర్షం వల్ల ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోయింది. 28వ డివిజన్ రాజేశ్వరి వీధి, జల్లా వారివీధి, సత్యనారాయణపురం, రైల్వేకాలనీ రోడ్డు, 31వ డివిజన్ శ్రీనగర్ కాలనీ, ముత్యాలంపాడు జెండా చెట్టు సెంటర్, 27వ డివిజన్ డీమార్ట్ సమీపంలో, శారదా కళాశాల రోడ్డుతో పాటు తదితర ప్రాంతాలలో వర్షపు నీరు రోడ్లపైనే నిలిచిపోయింది. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అంబేడ్కర్ విద్యా అకాడమీకి ఫ్యాన్ల వితరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని డాక్టర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో నూతనంగా నిర్మించిన హాల్‌కు అవసరమైన ఆరు ఫ్యాన్లను ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్ర ప్రసాద్ (ఎస్ఆర్‌పీ) సతీమణి, సామాజికవేత్త గుళ్లపల్లి జ్యోత్స్న ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని వితరణగా ఇచ్చారు. విజయవాడ లాయర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యానికి ఈ ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే జ్యోత్స్న చిరస్మరణీయురాలని అన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆమె అన్ని రకాలుగా సాయం చేసి వారి అభ్యున్నతిని కాంక్షించేవారని గుర్తు చేసుకున్నారు. డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు రొంపిచర్ల సత్యనారాయణ, దారా నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తరుణ్‌బాబునిర్వహించిన ఈ కార్యక్రమంలో లాయర్లు ఎస్.కృష్ణప్రసాద్, వి.రాజారత్నం, కె.క్రాంతి, అవుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.